క్లుప్తంగా

ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు



ముస్తాబవుతున్న కందగిరి సుబ్రమణ్యస్వామి ఆలయం

గుడిపాల: మండలంలోని కందగిరి కొండపై వెలసిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్య స్వామి వారి ఆలయంలో ఆగస్టు 15, 16 తేదీల్లో ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సుబ్రమణ్యంనాయుడు శుక్రవారం తెలిపారు. 15వ తేదీన శుక్రవారం భరణి, శనివారం కృత్తిక కావళ్లు ఉంటాయన్నారు. అదే రోజు మధ్యాహ్నం నుంచి అన్నదాన కార్యక్రమాలు రెండురోజుల పాటు కొనసాగుతాయని తెలిపారు. రాత్రి వీధినాటకంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

నేడు విద్యుత్ అంతరాయం

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ లైన్ల నిర్వహణ నిమిత్తం శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. ఈమేరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట చిత్తూరు నగరం, చిత్తూరు రూరల్స్, గుడిపాల, యాదమరి, బంగారుపాళ్యం, ఐరాల, తవణంపల్లె ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

విజయం డిగ్రీ కళాశాలకు నాక్ అక్రిడిటేషన్ పొడిగింపు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని మిట్టూరులో ఉన్న విజయం డిగ్రీ కళాశాల నాక్ అక్రిడిటేషన్ వ్యవధిని పొడిగించారని ఆ కళాశాల చైర్మన్ తేజోమూర్తి వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. యూజీసీ నుంచి స్వయం ప్రతిపత్తి (అటానమస్) సాధించడంతో బెంగళూరులోని నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (నాక్) అక్రిడిటేషన్ వ్యవధిని 2030వ సంవత్సరం డిసెంబర్ 31 వరకు అధికారికంగా పొడగించారన్నారు. ఈ పొడగింపు తమ కళాశాలలో నాణ్యమైన విద్య, విద్యానైపుణ్యాలు, సమగ్ర విద్యార్థుల అభివృద్ధికి దక్కిందన్నారు. రానున్న కాలంలో తమ కళాశాల ప్రమాణాలను మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతామన్నారు. ఇందుకు కృషి చేసిన అధ్యాపకులను ఆయన అభినందించారు.

చిత్తూరు రూరల్ మండలం అనంతాపురం వద్ద నేలకొరిగిన వరిపంట



గుడిపాల: చీలాపల్లెలో నేలకొరిగిన వరిపంట



గుడిపాల: నారగల్లులో దెబ్బతిన్న వరిపంట



చిత్తూరు రూరల్ : అనంతాపురం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వంక



దంచి కొట్టిన వర్షం

- చిత్తూరు నగరంలో మోస్తరు వర్షాలు
- గుడిపాల, రూరల్‌లో పొంగిపొర్లుతున్న మొరవలు
- దెబ్బతిన్న వరి పంట.. నగరంలో వ్యవస్థ డ్రైనేజీ అస్తవ్యస్తం

గుడిపాల/చిత్తూరు రూరల్/ చిత్తూరు అర్బన్: చిత్తూరు నియోజకవర్గంలో గత మూడు రోజులుగా వర్షం దండి కొడుతోంది. పగలంతా ఎండ వేడిమి ఎక్కువగా ఉన్నప్పటికీ, సాయంత్రం కాగానే వాతావరణం చల్లబడుతోంది. పైగా ఉరుములు, మెరుపులతో కూడిన గాలీవాన కురుస్తోంది. గుడిపాల, చిత్తూరు మండలాల్లో మొరవలు, వాగులు వర్షంతో పొంగిపొర్లుతున్నాయి. చిత్తూరు నగరంలో వర్షం కారణంగా లోతట్టు ప్రాంతాలు మురుగునీటితో నిండిపోయాయి. పలుచోట్ల డ్రైనేజీ వ్యవస్థ స్తంభించిపోయింది.

- గుడిపాల మండలంలో దాదాపు ఏడాది తరువాత వాగులు, వంకలు వర్షపు నీటితో కళకళలాడుతున్నాయి. మండలం మొత్తం కూడా భారీగానే వర్షం పడింది. ఫలితంగా గుడిపాల, బొమ్మసముద్రం, వసంతాపురం, పానాటూరు, చిత్తపార, నారగల్లు, నంగమంగళం, అడవిచేను ప్రాంతాల్లోని వాగులు పొంగిపొర్లుతున్నాయి. చీలాపల్లె గ్రామంలోని ప్రధాన రహదారిలో గురువారం రాత్రి వంక పొంగడంతో వర్షపు నీరు ఉధృతంగా ప్రవహించింది. గ్రామంలో రాకపోకలు స్తంభించిపోయాయి. శుక్రవారం ఉదయం పరిస్థితి అదుపులోకి వచ్చింది. అక్కడక్కడా రోడ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. వరిపంట కోతకు వస్తున్న దశలో వర్షం, గాలి వీచడంతో నేలకొరిగింది. పాపసముద్రం, పిళ్లారికుప్పం, అడవిచేను గ్రామాల్లో అరటిపంట కూడా దెబ్బతింది. చీలాపల్లె, నారగల్లు, 197 రామాపురం ప్రాంతాల్లో వరి పంట దెబ్బతింది.



చిత్తూరు గాండ్లపల్లె పాఠశాల వద్ద రోడ్డుపై పొంగుతున్న వర్షపు నీళ్లు



బంగారుపాళెం : చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న నీరు

- చిత్తూరు మండలంలో అనంతాపురం, అరతల ప్రాంతాల్లో వర్షం కారణంగా వరిపంట పూర్తిగా దెబ్బతింది. చేలల్లోకి వర్షపు నీరు నిలిచిపోవడంతో పంట మొత్తం పాడైంది. కొన్ని ప్రాంతాల్లో వరి కంకులు నేలకొరగడంతో నష్టం వాటిల్లింది. మండలంలోని తాళంబేడు, పెరుమాళ్ల కండ్రిగ, కుర్చివేడు, పచ్చనపల్లె, అనంతాపురం, పాలూరు ప్రాంతాల్లోని వాగులు, వంకలు వర్షపునీటితో కళకళలాడుతున్నాయి.
- చిత్తూరు నగరంలో మాత్రం వర్షం పడితే ప్రజలకు చుక్కలు కనిపిస్తున్నాయి. ప్రధానంగా నగర నడిబొడ్డున ఉన్న చాలా ప్రాంతాలు మురుగునీటితో నిండిపోతున్నాయి. చర్చి వీధి, ఆర్టీసీ డిపో రోడ్డు, వెంగళరావుకాలనీ, కొంగారెడ్డిపల్లె, రీడ్స్‌పేట, ఆర్టీసీ బస్టాండు ప్రాంతం, ఎంఎస్ఆర్, దర్గా కూడలి, పలమనేరు రోడ్డులో ని లోతట్టు ప్రాంతాలు, రామ్‌నగర్ కాలనీ ప్రాంతాల్లో వర్షపునీరు ఇళ్ల మధ్యే నిలిచిపోయింది. కార్పొరేషన్ సిబ్బంది కొన్నిచోట్ల నీటిని తొలగించగా, మరికొన్ని చోట్ల అలాగే నిలిచిపోయింది. చాలాచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.
- ఇక 11వ డివిజన్‌లోని ఎల్‌బీ పురంలో వర్షం కారణంగా ఓ గ్రామం మొత్తానికి మూడు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఫలితంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెరుమాళ్లకండ్రిగ వెనుకవైపు ఉన్న 220 కేవీ విద్యుత్‌లైన్లు తెగిపోవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. దీన్ని పునరుద్ధరించడానికి విద్యుత్‌శాఖఅధికారులు,సిబ్బంది శ్రమిస్తున్నారు.

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: బంగారుపాళెంలో శుక్రవారం సాయంత్రం గంట పాటు వర్షం దంచి కొట్టింది. రహదారి పక్కన తోపుడు బండ్లపై వ్యాపారాలు సాగించే చిరువ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. గురువారం రాత్రి కూడా ఇదే తరహాలో భారీ వర్షం కురిసింది. భారీ వర్షానికి మురుగు కాలువలు నిండి చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై వర్షపునీరు ప్రవహించింది. జాతీయ రహదారి పక్కన ఉన్న లోతట్టు ప్రాంతాలు వర్షం నీటితో నిండిపోవడం, ఇళ్లల్లోకి నీరు ప్రవేశించడంతో అవస్థలు పడ్డారు.



వర్షపునీటితో నిండిపోయిన చిత్తూరు ఆర్టీసీ బస్టాండు ప్రవేశమార్గం



ఇళ్లల్లోకి ప్రవేశిస్తున్న వర్షపునీరు



మురుగుకాలువల్లో పొంగిపొర్లుతున్న వర్షపునీరు



బంగారుపాళెంలో కురుస్తున్న వర్షం



కట్టమంచి చెరువు కట్ట రోడ్డుపై నిలిచిన వర్షపు నీళ్లు

సబ్‌స్టేషన్ చుట్టూ పిచ్చిమొక్కలు



సబ్‌స్టేషన్ వద్ద స్తంభాలకు అల్లుకున్న తీగలు

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో గిరింపేట ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్ వద్ద పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. నిర్వహణ లోపంతో వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం లేదు. దీంతో తీగలు సబ్‌స్టేషన్ చుట్టూ అల్లుకున్నాయి. అంతేకాకుండా కార్యాలయ ఆవరణ అపరిశుభ్రంగా ఉంది. విషపురుగులకు ఆవాసంగా మారింది.



చెట్ల కొమ్మల నడుమ విద్యుత్ తీగలు

లైన్‌కు అడ్డుగా మొక్కలు

స్థానిక ఓబనపల్లెలో విద్యుత్ లైన్ అడ్డుగా మొక్కలు పెరిగాయి. సకాలంలో ట్రీకటింగ్ చేసి వీటిని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. విద్యుత్ లైట్‌కు అడ్డంగా తీగలు ఉండడంతో చీకటి వేళ వెలుతురు సక్రమంగా రావడం లేదంటున్నారు.

పౌరసత్వ చట్ట సవరణను వ్యతిరేకించండి

చిత్తూరు కార్పొరేషన్: దొడ్డిదారిలో పౌరసత్వ చట్టసవరణ చేయాలని కేంద్ర ప్రభుత్వం యత్నిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు విమర్శించారు. శుక్రవారం నగరంలో నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు. బీహార్‌లో అడ్డదారిలో గెలవాలని ఎన్నికల సంఘంపై ఒత్తిడి తీసుకువచ్చి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)కు బీజేపీ ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. పౌరులు ఓటు హక్కును ప్రశ్నించే నిబంధనలు ఇందులో ఉన్నాయన్నారు. ఓటర్ లిస్టులను మార్చేసి బిహార్‌లో లక్షలాది మందికి ఓటు హక్కు తొలగించడం దారుణమని విమర్శించారు. బిహార్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పరిశీలన చేయనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ఇదే పద్ధతిని దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందన్నారు. గత కొన్నేళ్ల కిందట దేశవ్యాప్తంగా ప్రజలు తిరస్కరించిన పౌరసత్వ చట్ట సవరణలు సీఏఏ, జాతీయ పౌరసత్వ రిజిస్టర్ ఎన్సీఆర్ చట్టాలను ఎస్ఐఆర్ పేరుతో దొడ్డిదారిన అమలు చేయడానికి ప్రభుత్వం సిద్ధమైందన్నారు. అందుకే కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆయుధంగా చేసుకుందని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు జ్యోతిరావు తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

దసరా బ్రహ్మోత్సవ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరం గిరింపేటలోని దుర్గాంబ దేవస్థానంలో శుక్రవారం దసరా బ్రహ్మోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్, చైర్మన్ దిలీప్‌రెడ్డి, ఈఓ తిమ్మారెడ్డి ఈ పత్రాన్ని ఆవిష్కరించి కార్యక్రమ వివరాలను వెల్లడించారు. సెప్టెంబర్ 22వ తేదీ నుంచి ఆలయంలో దసరా బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతుందన్నారు.

వరలక్ష్మీ.. నమోస్తుతే



ప్రత్యేక అలంకరణలో పొన్నియమ్మ

- భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): వరాల తల్లీ దీవించు.. కోర్కెలు నెరవేర్చి చల్లగా చూడాలంటూ మహిళలు మనసారా వేడుకున్నారు. శ్రావణ శుక్రవారం చిత్తూరు నగరంలో వరలక్ష్మీ వ్రతాన్ని భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. మహిళలు ఉపవాస దీక్షలతో వరలక్ష్మీవ్రతం ఆచరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పలు ఆలయాల్లో కుంకుమార్చన, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా దుర్గాంబ దేవస్థానం, పొన్నియమ్మ, ముత్యాలమ్మ, సప్తకనికలమ్మ, కన్యాకపరమేశ్వరి, చౌడేశ్వరి, కరుమారియమ్మ ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి.

ఘనంగా వరలక్ష్మి వ్రతం

గుడిపాల: వరలక్ష్మీ వ్రతం వేడుకలు గుడిపాలలో వైభవంగా నిర్వహించారు. మహిళలు శుక్రవారం ఉదయం ఆలయాలకు వెళ్లి అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం ఇళ్లలోనే అమ్మవారి ప్రతిమలను అలంకరించి నైవేద్యం సమర్పించి ప్రత్యేక ఆభరణాలతో అలంకరించారు. పలు ఆలయాల వద్ద అన్నదానం నిర్వహించారు.



గుడిపాల: దుర్గాలమ్మ ఆలయంలో హోమం

బంగారుపాళెంలో..

బంగారుపాళెం: మండలంలో వరలక్ష్మీవ్రతాన్ని శుక్రవారం మహిళలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఇళ్లల్లో లక్ష్మీ దేవి ప్రతిమలను కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో మహిళలు ఆలయాలకు వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రత పూజలు

ఐరాల: మండలంలో శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రత పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున నుంచే మహిళలు శ్రావణ లక్ష్మికి స్వాగతం పలుకుతూ ఇళ్ల ముంగిళ్లలో అందమైన ముగ్గులు, గుమ్మాలకు పసుపు, కుంకుమ, మామిడి తోరణాలు కట్టి అందంగా అలంకరించారు. తమ పూజా మందిరాల్లో వరాలు ఇచ్చే వరలక్ష్మి అమ్మవారి చిత్రపటాలను, కలశాన్ని పీఠంపై ప్రతిష్ఠించి పూజలు చేశారు. అమ్మవారికి నూతన వస్త్రాలు సమర్పించారు. పండ్లు, వివిధ రకాల పిండి వంటకాలను నైవేద్యంగా సమర్పించారు. కుటుంబ సమేతంగా పూజల్లో పాల్గొన్నారు. ఇంటికి ముత్తైదువులను ఆహ్వానించి పసుపు, కుంకుమ, పూలు, తాంబూలాలు ఇచ్చి ఆశీర్వచనాలు తీసుకున్నారు. సాయంత్రం మహిళలు ఆలయాలకు వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు.



గుడిపాల: భద్రకాళమ్మ ఆలయంలో పూజలు

తవణంపల్లెలో..

తవణంపల్లె: మండలవ్యాప్తంగా గ్రామాల్లో ఇంటింటా అమ్మవారిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు.



ఐరాల:కొలువుదీరిన అమ్మవారు



గుడిపాల:రేణుకాంబ అమ్మవారు



బొమ్మసముద్రం దుర్గాలమ్మ ఆలయంలో..



బంగారక్క ఆలయంలో..



బంగారుపాళెం: మాధవనగర్‌లో..



గుడిపాల: దుర్గాలమ్మ ఆలయంలో భక్తులకు అన్నదానం